ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు బుధవారం(ఇఫ్తార్-6:35), గురువారం (సహెర్-5:00)

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

బుధవారం 20 మార్చి 2024

10 పోలింగ్ బూత్‌లు

» ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు » బూత్‌ల వారీగా ఓటర్ల విభజన

» కేటాయించిన బూత్‌లకే ఆయా నియోజకవర్గ ఓటర్లు

» ఓటర్లను ఆకట్టుకునే ఎత్తుల్లో పార్టీలు



మహబూబ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయం

మహబూబ్‌నగర్, మార్చి 19: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఇప్పటికే ఎన్నికల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జిల్లాలకు చెందిన 1,439 ఓటర్లను విభజించారు. 10 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి, సమీపంలోని మునిసిపాలిటీలను ఆయా బూత్‌లకు అలాట్ చేశారు.

● మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మూడు నియోజకవర్గాల జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మునిసిపాలిటీల కౌన్సిలర్‌లు, ఎక్స్ అఫిషియో సభ్యులు మొత్తం 245 మంది ఓటర్లు ఉన్నారు. వారు మహబూబ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయం కార్యాలయంలో ఓటు వేయాల్సి ఉంటుంది.

● వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్, దామరగిద్ద మండలాలకు చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కొడంగల్ మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్‌లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు మొత్తం 56 మంది కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఓటు వేయాల్సి ఉంది. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

● నారాయణపేట జిల్లా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, నారాయణపేట, మక్తల్, కోస్గి మునిసిపాలిటీ కౌన్సిలర్‌లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు మొత్తం 205 మంది ఓటరు నారాయణపేట ఎంపీడీవో కార్యాలయాన్ని ఓటు వేసేందుకు అలాట్ చేశారు.

● జోగులాంబ గద్వాల జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గద్వాల, అలంపూర్, అయిజ మునిసిపాలిటీల కౌన్సిలర్‌లు, ఎక్స్ అఫిషియో సభ్యులు 225 మందికి జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జడ్పీ మీటింగ్ హాల్‌ను కేటాయించారు.

● వనపర్తి జిల్లాలో చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు మునిసిపాలిటీల కౌన్సిలర్‌లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు కలిపి మొత్తం 218 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి వనపర్తి ఆర్డీవో కార్యాలయంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 67 మంది ఓటర్లకు కొల్లాపూర్ బాలిక జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని 101 మంది ఓటర్లకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పైకా భవనంలో, అచ్చంపేట నియోజకవర్గంలోని 79 మంది ఓటర్లకు అచ్చంపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, కల్వకుర్తికి చెందిన 72 మంది ఓటర్లకు కల్వకుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెంటర్లను సిద్ధం చేశారు.

● ఇక షాద్‌నగర్‌లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కొత్తూర్, షాద్‌నగర్, ఆమన్‌గల్, మునిసిపాలిటీలకు చెందిన కౌన్సిలర్‌లు, ఎక్స్ అఫిషియో సభ్యులు 171 మంది ఓటర్ల కోసం షాద్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



పెద్దమందడి మండలం మంగంపల్లిలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

ప్రచారంలో నాయకుల బిజీబిజీ

ఈనెల 28న ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ జరుగనుంది. ఓటింగ్‌కు మరో వారం రోజులు మాత్రమే సమయం ఉండటంతో బరిలో ఉన్న నాయకులు ప్రచారంలో బిజీ అయ్యారు. ఎక్కడికక్కడ ఆయా పార్టీలకు చెందిన కీలక నాయకులతో మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మునిసిపాలిటీ కౌన్సిలర్లతో మంతనాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి మన్నె జీవన్‌రెడ్డి, నవీన్‌రెడ్డిల మధ్య పోరు సాగుతుండటంతో ఆయా పార్టీల ముఖ్యులు ఓటర్ల మద్దతుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే చాలాచోట్ల అధికార కాంగ్రెస్ పార్టీలో పలువురు కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ సభ్యులు చేరుతున్నారు. మరికొన్ని చోట్ల బీఆర్‌ఎస్‌లో ఉంటూనే తమకు మద్దతిస్తారని అధికార పార్టీ ధీమాగా ఉంది. బీఆర్‌ఎస్ మాత్రం మెజారిటీ సభ్యుల సంఖ్యాబలం ఉన్నందున అందులో కొందరు పార్టీ మారినా మిగతా వారి మద్దతుతో గట్టెక్కుతామని లెక్కలేసుకునే పనిలో ఉంది. అయితే మాజీ ఎమ్మెల్యేలు కొన్ని చోట్ల ఇప్పటివరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగానే ఉంటున్నట్లు బీఆర్‌ఎస్‌లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ మాత్రం ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను రంగంలోకి దింపి, ఎన్నికలపై పట్టు బిగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. సమయం దగ్గర పడుతున్నందున ఎన్నికలకు ఒకట్రెండు రోజుల ముందు ఓటర్లను శిబిరాలకు తరలించి, నేరుగా బూత్‌లకు తీసుకువచ్చేలా పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి.

వేరుశనగ రైతు పరేషాన్

» దిగుబడి లేదు.. మద్దతు ధర అందదు

» మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల మోసం



కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ కుప్పలు

కల్వకుర్తి, మార్చి 19: వేరుశనగకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్వింటాలుకు రూ.ఆరు వేలకు పైగా మాత్రమే ధర పలుకుతుండటంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి కల్వకుర్తి మండలంలో ఈ యాసంగిలో 8,244 ఎకరాల్లో రైతులు వేరుశనగను సాగు చేశారు. సీజన్ మొదట్లో పంట సాగు చేసి, నీటి వసతి ఉన్న రైతులకు ఆశించిన రీతిలో దిగుబడి వచ్చింది. అక్టోబరులో పంట సాగు చేసిన రైతులకు దిగుబడి సరిగా రాలేదు. పైగా మద్దతు ధర కూడా లేకపోవడంతో నష్టాలే మిగిలాయని అంటున్నారు.

మార్కెట్‌లోనూ దగానే..

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ తెచ్చిన రైతులను కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు దగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వంగూరు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు మార్కెట్లో జరుగుతున్న తూకాల్లో మోసాన్ని గుర్తించారు. కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్ల నుంచి రైతులకు మోసాలు జరుగకుండా, మద్దతు ధర అందేలా చూడాల్సిన అధికారులు పర్యవేక్షణను విస్మరించారు. దాంతో కొందరు కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

మిల్లుల వద్దే కొనుగోళ్లు

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ పరిధిలో 22 మంది కమీషన్ ఏజెంట్లు, 43 మంది ట్రేడర్లు ఉన్నారు. అందులో 12 మంది వేరుశనగను కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది ట్రేడర్స్ తమ మిల్లుల వద్దే వేరుశనగ కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు చేస్తూ, మద్దతు ధర చెల్లించడం లేదు. గ్రామాల్లో సైతం కల్లాల వద్దే వ్యాపారులు కొనుగోలు చేస్తూ తూకాల్లోను మోసాలకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి.

పెట్టుబడి కూడా రాలేదు

నేను మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశాను. రెండు క్వింటాళ్ల 15 కేజీల విత్తనాలు వేశాను. విత్తనాల కొనుగోలుకు, కూలీలకు, పల్లీలు పట్టడానికి మిషన్‌కు మొత్తం రూ.లక్షా 10 వేలు ఖర్చయ్యింది. ఆరుగాలం కష్టపడితే 16 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. వేరుశనగను కల్వకుర్తి మార్కెట్ యార్డుకు విక్రయానికి తెస్తే క్వింటాల్‌కు రూ.6,411 ధర పలికింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు.

- రైతు తిరుపతిరెడ్డి, సింగినోనిపల్లి, వెల్దండ మండలం

రైతులకు నష్టం జరగనివ్వం



కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు నష్టం జరుగకుండా చూస్తాం. కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు తూకాల్లో మోసాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఏమైనా సమస్యలుంటే రైతులు మా దృష్టికి తేవాలి.

- భగవంతు, మార్కెట్ కార్యదర్శి

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

» జర్దా, కల్లు మానేయాలని భర్త మందలించడమే కారణం

బిజినేపల్లి, మార్చి 19 : జర్దా, కల్లు తాగుడు మానేయాలని భర్త మందలించాడని మనస్తాపం చెందిన జర్పలావత్ పార్వతమ్మ(43) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పోలేపల్లి తండాకు చెందిన పార్వతమ్మ, గోపాల్‌నాయక్ భార్యాభర్తలు. భార్య కల్లుకు అలవాటు పడటంతో ఆరోగ్యం పాడు చేసుకుంటున్నావని భర్త మందలించాడు. దీనిని అవమానంగా భావించి క్షణికావేశంతో ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగింది. గమనించిన కుమారుడు సాయినాయక్ వెంటనే నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈఘటనపై మృతురాలి కుమారుడు నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మార్పులను అధ్యయనం చేయాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 19: కామర్స్ విద్యార్థులు మార్కెట్‌లో వస్తున్న అధునాతన మార్పులను అధ్యయనం చేయాలని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. మంగళవారం పీయూ అకాడమిక్ సెమినార్ ఆడిటోరియంలో తెలంగాణ కామర్స్ అసోషియేషన్(టీసీఏ), పీయూ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రేరణ కామర్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా వచ్చిన టీసీఏ అధ్యక్షుడు, కామర్స్ డీన్ ప్రొఫెసర్ డి.చెన్నప్ప.. ఉస్మానియా వర్సిటీ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్, ఐఏఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ అప్పారావు, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. వచ్చిన అవకాశలను వినియోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు టీసీఏ అధ్యక్షుడు డి.చెన్నప్ప మాట్లాడుతూ టీసీఏ నిర్వహిస్తున్న ప్రేరణ కార్యక్రమం కామర్స్ విద్యార్థులకు ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఆధునిక కాలంలో మార్కెట్‌లో వస్తున్న మార్పులు, వాటిపై చేసే పరిశోధనలు, అధ్యయనాల గురించి ఐఏఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ అప్పారావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన కామర్ విద్యార్థులకు వ్యాస రచన, రంగోలి, బిజినెస్ క్విజ్, పెయింటింగ్, కామర్స్ క్వెస్టా, పేపర్ ప్రజంటేషన్, జస్ట్ మినిట్ వంటి వివిధ కార్యక్రమాలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఓయూ డీన్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య,ప్రొఫెసర్ ఆర్.వెకంటేశ్వర్లు, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ప్రేరణ కన్వీనర్ డాక్టర్ రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పీయూ కామర్స్, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

» మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో..

» గద్వాల పురపాలిక బీఆర్‌ఎస్ చైర్మన్ సహా 16 మంది కౌన్సిలర్లు



మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గద్వాల మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

కొల్లాపూర్/గద్వాల/గద్వాల టౌన్, మార్చి 19: మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు మంగళవారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని జూపల్లి ఇంట్లో వారు కండువా కప్పుకున్నారు. గద్వాల మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తోపాటు 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కారు దిగేందుకు చర్చలు జరిగాయి. మంత్రి జూపల్లితోపాటు గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరితతో హామీ వచ్చి, చర్చలు సఫలీకృతం కావడంతో వారు కాంగ్రెస్‌లో చేరారు. జూపల్లి కృష్ణారావు వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా బీఆర్‌ఎస్‌కే చెందిన కొల్లాపూర్ మునిసిపాలిటీ నలుగురు కౌన్సిలర్లు, కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన నలుగురు, పాన్‌గల్ మండలానికి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి.

సరైన గుర్తింపు లేనందునే..

గద్వాల మునిసిపాలిటీలో చైర్మన్, కౌన్సిలర్లకు బీఆర్‌ఎస్ పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడం, అవమానాలు ఎదుర్కోవడం వల్లే పార్టీ మార్చినట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున, అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా పాలన సాగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గద్వాల మునిసిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు హస్తం కండువా కప్పుకున్నారు. ఇప్పుడు చైర్మన్‌తో పాటు 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాసానికి తావులేకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు.

వీడిన చిక్కుముడి

» పదవులకు రాజీనామా చేసిన వనపర్తి పురపాలిక చైర్మన్, వైస్ చైర్మన్

» మునిసిపాలిటీలో నెలకొన్న అవిశ్వాసం ఇక లేనట్లేనా?

» కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ



పదవులకు రాజీనామా చేస్తున్న వనపర్తి మునిసిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

వనపర్తి టౌన్, మార్చి 19: వనపర్తి మునిసిపాలిటీలో గత కొన్ని నెలలుగా నెలకొన్న అవిశ్వాసం చిక్కుముడి వీడినట్లే కనిపిస్తోంది. మునిసిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తమ పదవులకు మంగళవారం రాజీనామా చేయడం అందుకు అద్దం పడుతోంది. రాజీనామా లేఖలను మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు అందజేశారు. మొదటగా వైస్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, సాయంకాలం 4.55 గంటలకు కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు లేఖను అందించారు. చైర్మన్ గట్టు యాదవ్ మాత్రం కార్యాలయ సమయం దాటిన తరువాత 5.17 గంటలకు తన రాజీనామా లేఖను కమిషనర్‌కు అందించారు. వీరిద్దరూ ఇచ్చిన రాజీనామా లేఖలు ఆమోదం పొందితేనే గత కొన్ని నెలలుగా నెలకొన్న అవిశ్వాసం చిక్కుముడి వీడినట్లు అవుతుంది.

అనేక సమావేశాల అనంతరం..

మునిసిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఒంటెత్తు పోకడలు పోతున్నారని.. మెజారిటీ కౌన్సిల్ సభ్యులు వారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నారు. దీంతో నాటి నుంచి నేటి వరకు అనేక పర్యాయాలు బీఆర్‌ఎస్ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డిలు అసమ్మతి కౌన్సిలర్లతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. అయినప్పటికీ చర్చలు మాత్రం ఫలించలేదు. ఎట్టకేలకు గత నెల 26న జిల్లా కలెక్టర్‌ను కలిసిన అసమ్మతి కౌన్సిల్ సభ్యులు అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సిందేనని వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ ఈనెల 12న అవిశ్వాసానికి సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు, కౌన్సిల్ సభ్యులకు లేఖలు పంపించారు. దీంతో ఒక అడుగు ముందుకేసిన మాజీ మంత్రి చైర్మన్, వైస్ చైర్మన్‌లతో అవిశ్వాసానికంటే ముందే తమ పదవులకు రాజీనామా చేసి, గౌరవంగా వైదొలగాలని సూచించినట్లు తెలిపింది. దాంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ వ్యక్తిగత కారణాలు చూపుతూ మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు వారిద్దరూ తమ పదవులు చేపట్టినప్పటి నుంచి మంగళవారం సాయంకాలం వరకు నాలుగేళ్ల 52 రోజుల పాటు కొనసాగారు.

తెరపైకి రోజుకో పేరు..

గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్‌లు తమ పదవులకు రాజీనామా సమర్పించడంతో కొత్తగా బాధ్యతలు ఎవరు స్వీకరించబోతున్నారు, ఎవరిని ఎన్నుకోబోతున్నారనే దానిపైనే సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తరుణంలోనే రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది. మొదటగా చైర్మన్‌గా 13వ వార్డు కౌన్సిలర్ పుట్టపాకల మహేష్ పేరు, వైస్ చైర్మన్‌గా 20వ వార్డు కౌన్సిలర్ పాకనాటి కృష్ణ పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా మరో ఇద్దరి పేర్లు కూడా వినిపిస్తుండటంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరన్నదానిపైనే చర్చ సాగుతోంది. అలా కాకుండా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ రాజకీయ చతురతను ప్రయోగిస్తే మాత్రం చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు వారి చేతిలోకి పోయే అవకాశం కూడా లేకపోలేదు.

పెంపుడు కుక్కను చంపాయనే..

» వీధి కుక్కలను కాల్చి చంపిన ఆ గ్రామ అల్లుడు

» అడ్డాకుల మండలం పొన్నకల్ కేసును ఛేదించిన పోలీసులు

» ముగ్గురి రిమాండ్..

» వివరాలు వెల్లడించిన ఎస్పీ హర్షవర్ధన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, మార్చి 19: పెంపుడు కుక్కను వీధి కుక్కలు కరిచిచంపాయన్న కారణంతో వాటిపై విచక్షణా రహితంగా కాల్పులు జరుపడంతో 20 కుక్కలు మరణించగా, మరో ఐదింటికి గాయాలయ్యాయి. గత ఫిబ్రవరిలో మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన ఎం.నర్సింహారెడ్డి(57) కొద్ది రోజుల క్రితం తన పెంపుడు కుక్కలతో అత్తగారి ఊరైన అడ్డాకుల మండలం పొన్నకల్‌కు వెళ్లాడు. ఆ సమయంలో వీధి కుక్కలు నర్సింహారెడ్డికి చెందిన డాష్‌హ్యాండ్ పెంపుడు కుక్కతోపాటు మరో కుక్కను కరిచాయి. దాంతో డ్యాష్‌హ్యాండ్ కుక్క చనిపోగా, మరో పెంపుడు కుక్కకు గాయాలయ్యాయి. వీధి కుక్కలు తన పెంపుడు కుక్కను కరిచి చంపాయని వాటిపై నర్సింహారెడ్డి కోపం పెంచుకున్నాడు. వాటన్నింటిని మట్టుపెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న రాత్రి స్నేహితులు తారిక్ అహ్మద్, మహ్మద్ తాహిర్‌లతో కలిసి బెంజ్‌కారులో హైదరాబాద్ నుంచి పొన్నకల్ గ్రామానికి వచ్చాడు. అత్తగారింట్లో భోజనం చేశారు. అర్ధరాత్రి 1:30 గంటలకు అందరూ పడుకున్నారని నిర్ధారించుకుని.. తారిక్ అహ్మద్‌కు చెందిన లైసెన్స్‌డ్ గన్ 0.22 తుపాకీతో కారులో వీధిలోకి వెళ్లారు. నర్సింహారెడ్డి తుపాకీతో గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి సబ్‌స్టేషన్ వరకు కనిపించిన కుక్కలను కాల్చడం మొదలుపెట్టాడు. ఇలా 25 కుక్కలను కాల్చగా.. అందులో 20 చనిపోయాయి. ఆ తరువాత కారులో హైదరాబాద్ వెళ్లిపోయారు. ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అదే కారులో నర్సింహారెడ్డి, తారిక్ అహ్మద్, మహ్మద్ తాహిర్ పొన్నకల్‌లో దావత్ చేసుకునేందుకు రాగా.. భూత్పూర్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ సత్యనారాయణ, శ్రీనివాసులు, నరేందర్, కానిస్టేబుళ్లు జమీర్, నరేశ్, శంకర్, రాజు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 0.22 రైఫిల్, బెంజ్‌కారు, ఆరు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

ఆల్ ఇండియా అథ్లెటిక్స్‌లో జిల్లా వాసికి గోల్డ్ మెడల్

నారాయణపేట, మార్చి 19 : ఆల్ ఇండియా అథ్లెటిక్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు రవికుమార్ గోల్డ్ మెడల్ సాధించారు. చండీఘడ్‌లో ఈనెల 19 నుంచి 21 వరకు మూడురోజుల పాటు నిర్వహించిన పోటీల్లో పేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన రవికుమార్ 400 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రతిభ సాధించినట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. రవికుమార్ మొదటిరోజు పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించడం అభినందనీయమన్నారు.



గోల్డ్‌మెడల్ సాధించిన రవికుమార్

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో

మక్తల్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను సన్మానిస్తున్న సీఐ చంద్రశేఖర్

మక్తల్, మార్చి 19 : ఈనెల 9, 10 తేదీల్లో మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగిన ఎనిమిదవ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ రేస్ పోటీల్లో పేట జిల్లాకు చెందిన ఆరుగురు బాలబాలికలు క్రీడా ప్రతిభ కనబర్చినట్లు రిటైర్డ్ పీఈటీ గోపాలం తెలిపారు. రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి 210మంది బాలబాలికలు పాల్గొనగా నారాయణపేట జిల్లా నుంచి మొదటి సారిగా రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న చాతుర్య 9వ ర్యాంకు, వినయ్ 7వ ర్యాంకు, అక్షర 12, చక్రవర్తి 11, మహేశ్వరి 15, అబ్దుల్ రహెమాన్ 20వ ర్యాంకు సాధించినట్లు పీఈటీ వివరించారు. సీఐ చంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్ క్రీడాకారులను అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పీఈటీలు రమేష్‌కుమార్, అంబ్రేష్, దామోదర్, శివశంకర్‌లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

కోస్గి రూరల్, మార్చి 19 : ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముంగిమళ్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని బిచ్చప్ప(20) అనే యువకుడు సోమవారం రాత్రి ట్రాక్టర్‌పై గ్రామ శివారులోని వ్యవసాయ పొలానికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బిచ్చప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న మరో వ్యక్తి కొత్తపల్లి గ్రామానికి చెందిన అద్దులప్ప చాకచక్యంగా దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఘటనపై మృతుడి పెద్దనాన్న బసప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత, కేసు నమోదు

నర్వ, మార్చి 19 : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారుజామున నర్వ ఎస్సై కుర్మయ్య పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ముష్టిపల్లి గ్రామంలోని వాగు నుంచి అదే గ్రామానికి చెందిన బెల్లం నరేష్, మేకల ఆనంద్, మేకల శ్రీహరిలకు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లు రాత్రి వేళల్లో నర్వ మండలం పెద్దకడ్మూర్ గ్రామానికి తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై వివరించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



వేముల చక్రవర్తి (ఫైల్)

బిజినేపల్లి, మార్చి 19 : భార్య కాపురానికి రాకపోగా తనపై కేసు పెట్టిందన్న అవమానంతో వేముల చక్రవర్తి (32) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నాగశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన వేముల చక్రవర్తికి గంగారం గ్రామానికి చెందిన దేవితో 12 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మద్యం తాగి పట్టించుకోవడం లేదని ఏడాదిన్నర క్రితం భర్తను వదిలేసి పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. అంతేకాకుండా భర్తపై కేసు పెట్టింది. ఈ క్రమంలో కాపురానికి రావాలని భార్యను కోరినా పట్టించుకోకుండా అవమానించిందని మనస్తాపం చెంది గ్రామంలోని సొంత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనపై మృతుడి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకే రోజు ఏడుగురిపై కుక్కల దాడి

కందనూలు, మార్చి 19 : ఒకే రోజు ఏడుగురు పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలు నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకేరోజు పదేళ్లలోపు ఏడుగురు పిల్లలు అభిరామ్, కార్తీక్, గణేష్, ఆలియాతోపాటు మరో ముగ్గురు చిన్నారులకు కుక్కలు కరవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా వీధి కుక్కలు గ్రామంలో పిల్లలు పాఠశాలల కు వెళ్లేటప్పుడు వారిపై ఎగబడి కాటేస్తున్నాయని వాపోయారు. పిల్లలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సనందించారు. మునిసిపాలిటీ పరిధిలో కుక్కలను నియంత్రించాల్సినవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి హెల్ప్ లైన్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) మార్చి 19 : మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను పరిష్కారానికి ప్రత్యేకంగా హెల్ప్ లైన్ నెంబర్ 08542-242024ను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా తాగునీటి సరఫరాలో ఇబ్బంది కలిగితే ఆ నెంబర్‌కు ఫోన్ చేయాలని మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ కె. వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ సర్కిల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో ఎదురయ్యే తాగునీటి సమస్యలను హెల్ప్ లైన్ నెంబర్ ద్వారా తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు మాత్రమే ఈ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉదయ 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.

ప్రతీ కార్యకర్త నా కుటుంబమే

- అపోహలుంటే మనసులోంచి తీసివేయాలి
- కార్యకర్తల సమావేశంలో డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), మార్చి 19 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ.140 కోట్ల జనాభా నా కుటుంబమని అంటున్నారని, అలాగే పార్టీకి చెందిన ప్రతీ కార్యకర్త నా కుటుంబమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ పరిధిలోగల కాళికాంబ కల్యాణమండపంలో జరిగిన పార్టీ జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను గ్రూపు రాజకీయాలు చేయనన్నారు. ప్రతీ కార్యకర్త తనతో మనసు విప్పి మాట్లాడవచ్చని సూచించారు. ఏవైనా అపోహలున్నా వాటిని మనసు నుంచి తీసివేయాలని కోరారు. ప్రతీక్షణం మీకు అండగా ఉంటానని ఆమె వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానిని చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పవన్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, క్రమశిక్షణ సంఘం నాయకులు నాగురావు నామాజీ, పార్లమెంట్ కో-కన్వీనర్‌లు నర్సింహగౌడ్, భీమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు, మహబూబ్ నగర్ జిల్లా మాజీ అధ్యక్షులు వీరబ్రహ్మచారి, వనపర్తి మాజీ జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

ఊర్కొండ, మార్చి 19: పాత కక్షలను మనసులో పెట్టుకొని కుటుంబీకులపై దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని జగబోయిన్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. జగబోయిన్‌పల్లి గ్రామంలో ఆరు నెలల క్రితం జరిగిన సంఘటనలో ఎలుగొండ సింహారెడ్డి కుటుంబికుల పాత్ర ఉందని మనస్సులో పెట్టుకున్న యాదయ్య, శేఖర్, పద్మ, పార్వతమ్మ, పాండయ్య రాములమ్మలు ఎలుగొండ సింహారెడ్డి ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. దాంతో సింహారెడ్డి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

- రూ. 50 వేలకు మించితే అధారాలు చూపాలి - ఉండవల్లి ఎస్ఐ కె. శ్రీనివాస్‌నాయక్



ఏపీ తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్

అలంపూర్ చౌరస్తా, మార్చి 19 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రం సరిహద్దులో తనిఖీలను ముమ్మరంగా చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్ ప్లాజా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఎస్ఐ కె.శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి తీసుకెళ్లాలంటే తప్పనిసరిగా నగదుకు సంబంధించిన ఆధారాలను వెంట ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

- ప్రారంభించిన జడ్పీటీసీ సభ్యురాలు విశాల శ్రవణ్ రెడ్డి - విజేతగా నాగర్ కుర్నూల్ జిల్లా



పందెం బండకు పూజచేసి పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు విశాలశ్రవణ్ రెడ్డి

కేశంపేట, మార్చి 19: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. పోటీలను కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి ప్రారంభించారు. పోటీలలో నాగర్‌కుర్నూల్, గద్వాల జోగులాంబ, వనపర్తి జిల్లాకు చెందిన ఎద్దుల జతలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి నాగర్‌కుర్నూల్ జిల్లా జోజిరెడ్డి ఎద్దుల జత పొందింది. ప్రథమ బహుమతిని దాత కొట్టం శశివర్ధన్ రెడ్డి రూ. 60వేలు నగదును అందించారు. రెండవ బహుమతిని గద్వాల బోగులాంబజిల్లా హరి ఎద్దుల జత గెలుచుకుంది. రెండవ బహుమతిని దాత ఎల్లనమోని యాదయ్య యాదవ్ రూ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై. యాదయ్య యాదవ్ రూ. 50వేలు, మూడవ బహుమతిని వనపర్తి జిల్లా, పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దుల జత సాధించింది, మూడవ బహుమతిని జడ్పీటీసీ సభ్యుడు తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి రూ. 30వేలు అందించారు. గద్వాల జోగులాంబ జిల్లా అయిజ కు చెందిన భాస్కర్ గౌడ్ ఎద్దుల జత నాల్గొవ బహుమతిని సాధించింది. నాల్గొవ బహుమతి రూ. 20వేలు యెన్నం గోపాల్‌రెడ్డి అందించారు. పోటీలను తిలకించడానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రూప్లానాయక్, కృష్ణయ్య, రాఘవేందర్ రావు, నాయకులు యాదగిరి చారి, కొట్టం శశివర్ధన్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, అంజయ్య, కుమార్ యాదవ్, బాబుయాదవ్, అర్జున్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో గర్భిణి మృతి

» ఆర్ఎంపీతో ఏఎన్‌సీ చెకప్‌లు

మహబూబ్‌నగర్(వైద్య విభాగం) మార్చి 19: కుటుంబ సభ్యుల అవగాహన లేమితో ప్రభుత్వ ఆస్పత్రిలో కాకుండా.. ఓ ఆర్ఎంపీతో ఏఎన్‌సీ చెకప్‌లు చేయించుకోవడంతో ఫిట్స్ వచ్చి ఓ గర్భిణి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. దేవరకద్ర మండల కేంద్రానికి చెందిన ఆర్తికకు కోయిలకొండ మండలం చంద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్‌తో ఏడాదిన్నర క్రితం పెళ్లి జరిగింది. ఆమె గర్భం దాల్చడంతో చెకప్‌లన్నీ ధన్వాడ మండలం రామకిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ చాంద్‌పాష వద్ద చేయించుకుంది. కేవలం స్కానింగ్‌లకు, టీకాలకు మాత్రమే దేవరకద్రలో చూయించుకుంది. కాన్పు కూడా ఆర్ఎంపీ వద్దే చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. సాధారణ కాన్పు అయిన తర్వాతే తనకు డబ్బులు ఇవ్వాలని ఆ ఆర్ఎంపీ సూచించడంతో ప్రతీ నెల అతని వద్దే చెకప్‌లు చేయించుకుంటున్నారు. ఇటీవల ఆమెకు తొమ్మిది నెలలు నిండడంతో కాన్పు కోసం తల్లిగారి ఇంటివద్దే ఉంటోంది. సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఆమెకు ఫిట్స్ రావడంతో అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమెకు నిరంతరంగా ఫిట్స్ వస్తూనే ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచారు. డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆమె మంగళవారం మధ్యాహ్నం చనిపోయింది. ఈ విషయమై ఆస్పత్రి వైద్యులను వివరణ కోరగా తమ వద్దకు వచ్చినప్పుడే ఆమెకు చాలా సీరియస్‌గా ఉందని చెప్పారు. బీపీ ఎక్కువగా ఉండి నిరంతరంగా ఫిట్స్ వస్తున్నాయని, కనీసం కడుపులో బిడ్డనైనా కాపాడాలని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. రెగ్యులర్ చెకప్‌లు లేకపోవడం, బీపీ మాత్రలు వాడకపోవడం వలన ఇలాంటి పరిణామాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్ఎంపీల వద్దకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రెగ్యులర్ చెకప్‌లు చేయించుకోవాలని, కాన్పులు కూడా అక్కడే చేయించుకుంటే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని పేర్కొన్నారు.

తనిఖీల్లో పట్టుబడిన నగదు సీజ్



పట్టుబడిన నగదుతో ఎస్ఐ

పెబ్బేరు, మార్చి 19: పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నూల్ బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఒక వ్యక్తి కర్నూల్ నుంచి వీపనగండ్లకు తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 90,300 నగదు తీసుకువెళ్తూ పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైనా రూ.50వేలకు మించి తీసుకు వెళ్లరాదని, ఒక వేళ తీసుకెళ్తే తగిన ఆధారాలు ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, విలువైన వస్తువులు తీసుకెళ్లరాదని తెలిపారు.

బాలానగర్‌లో..

బాలానగర్ : పోలీసులు ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు క్యాంప్‌ల వాద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా వాహనాలలో తీసుకువస్తున్న రూ. లక్షా 50వేల 500ను పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తులకు సరైన ధ్రువపత్రాలను చూయించి డబ్బులు తీసుకువెళ్లాలని ఎస్ఐ తిరుపాజీ తెలిపారు. తనిఖీలలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ తిరుపాజీ, ఏఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

మద్యం పట్టివేత

పెద్దమందడి, మార్చి 19: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని పామిరెడ్డిపల్లిలో మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడులలో సుమారు 75 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మంగళవారం బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు జరిపి ఒక షాపులో 51 లీటర్ల మద్యం, మరో షాపులో 24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

గండీడ్, మార్చి 19 : బెల్టుషాపులో మద్యం అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదైన సంఘటన మండల పరిధిలోని కొంరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పోలీసులు కొంరెడ్డిపల్లి గ్రామంలో బెల్టు షాపులో రైడ్ చేయగా ఇద్దరు వ్యక్తులు మద్యం అమ్ముతుండగా పట్టుపడ్డారు. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా మద్యం అమ్మినా, రవాణా చేసినా, దగ్గర పెట్టుకున్నా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి ఇసుక ట్రాక్టర్ బోల్తా



మద్దిగట్ల సమీపంలో వంతెనపై నుంచి వాగులో పడ్డ ఇసుక ట్రాక్టర్

పెద్దమందడి, మార్చి19: అదుపుతప్పి ఇసుక ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి గ్రామం ఊక చెట్టు వాగు నుంచి ఇసుకను మద్దిగట్లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మద్దిగట్ల సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి వంతెనపై నుంచి వాగులో పడింది. మైనర్ ట్రాక్టర్ నడపడం వల్లన ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

ఇసుక డంపు సీజ్



ఇసుక డంపులను సీజ్ చేస్తున్న ఆర్ఐ జయమ్మ, ఎస్ఐ నరేందర్

ఆత్మకూరు, మార్చి 19: ఇసుక అక్రమ రవాణా చేసినా.. డంపు చేసినా కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని పిన్నంచర్ల శివారులో ఇసుకను అక్రమంగా డంపు చేశారనే సమాచారంతో ఆర్ఐ జయమ్మతో కలిసి తనిఖీ చేశామన్నారు. అల్లిపూర్ గ్రామం ఊక చెట్టు వాగు నుంచి గ్రామంలో కొందరు ఎద్దుల బండ్ల ద్వారా అక్రమంగా ఇసుకను తీసుకువచ్చి డంపు చేశారని తెలిపారు. ఈ డంపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన ట్రాక్టర్లు

హన్వాడ, మార్చి 19 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున ఇబ్రాహింబాద్ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్ల యజమానులు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తీసుకువెళ్తున్న సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కల్వకుర్తి, మార్చి 19 : కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామ సమీపంలోని దుందుభీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. వివరాల ఎస్ఐ కథనం ప్రకారం.. గుండూరు గ్రామంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారంతో పోలీస్ సిబ్బంది వెళ్లి ట్రాక్టర్‌ను గుర్తించారు. ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్, ఓనరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చెరకు కోతలు పూర్తయ్యే వరకు పరిశ్రమ నడిపించాలి



డిమాండ్ పత్రం విడుదల చేస్తున్న ఉమ్మడి జిల్లాల చెరుకు రైతుల సంఘం అధ్యక్షుడు

ఆత్మకూరు, మార్చి 19: చెరకు పంట కోతలు పూర్తయ్యే వరకు పరిశ్రమ నడిపించాలని కృష్ణవేణి షుగర్‌ఫ్యాక్టరీ ఉమ్మడి జిల్లాల రైతు సంఘం అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ వరకు కోతలు పూర్తి చేసుకోవాలని అనంతరం పరిశ్రమను మూసివేస్తామని షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం ప్రకటన విడుదల చేసింది. అది సరైనది కాదని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 220 ఎకరాల్లో 7 టన్నుల దాకా చెరుకు పంట కటింగ్ చేయాల్సి ఉంది. కార్మికుల కొరత కారణంగా రైతులు ఇప్పటి వరకు కటింగ్ పూర్తి చేయకలేకపోయారు. కావున షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి కోతలు పూర్తయ్యే వరకు పరిశ్రమ నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెరకు రైతుల సంఘం ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి నారాయణ, ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ధర్నా



మునిసిపాలిటీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ప్రజలు

ఆత్మకూరు, మార్చి 19: ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పదో వార్డులో ఏర్పడిన తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పట్టణ ప్రజల మంగళవారం మునిసిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. వారం రోజుల నుంచి తమ కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి తాగునీరు సరఫరా చేసే పైపులు పగిలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే నీటి సమస్య తలెత్తిందని వారు ఆరోపించారు. తక్షణమే అధికారులు సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియత్

కొల్లాపూర్, మార్చి 19 : సంఘ సంక్షేమానికి కృషి చేసిన మహనీయులే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు సంఘ సేవా చేయాలని పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియత్ పేర్కొన్నారు. పట్టణంలోని పీజీ సెంటర్‌లో సంఘ సంక్షేమ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సంఘ సంక్షేమ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సంక్షేమ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకటేశం మాట్లాడుతూ పీడిత ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన ధ్యేయం కావాలని ఆయన పేర్కొన్నారు. సంఘ సంక్షేమ శాస్త్ర అధ్యాపకుడు దేవరాజు అధ్యాపకులు, విద్యార్థుల చేత సంఘ సంక్షేమానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఈజీఎస్ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకట్రాములు

కల్వకుర్తి, మార్చి 19 : నర్సరీలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో వెంకట్రాములు సూచించారు. మంగళవారం కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. శానిటేషన్, నర్సరీ, ఈజీఎస్ పనులను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈజీఎస్ కూలీలకు వసతులు కల్పించాలని, పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో రాజు, ఈసీ చందన, కార్యదర్శి వంశీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్ తదితరులున్నారు.

ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరగాలి

తిమ్మాజిపేట, మార్చి 19 : రైతుకు ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరగాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచలో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆగ్రో సేవా కేంద్రంలో నిల్వ ఉన్న రైతుకు అమ్మకాలకు సంబంధించిన ఎరువుల వివరాలు ఎప్పటిప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రైతుకు ఎరువు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అమ్మితే రశీదు ఇవ్వాలని, నిషేధిత మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగా పోటీ

- బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిలు యోసేపు, నాగన్న

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి19: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జిలు బీసమొల్ల యోసేపు, అంతటి నాగన్న స్పష్టం చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలోకి వ్యక్తులు వస్తూ పోతూ ఉంటారని, పార్టీ మాత్రం నిరంతరం మనుగడలో ఉంటుందన్నారు. బీఎస్పీ దేశంలో, రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తులు లేవని, నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా శ్రమించి పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ జాతీయ అధినేత్రి మాయావతి పిలుపునిచ్చారన్నారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, జిల్లా మహిళా కన్వీనర్ సృజన, కోశాధికారి వెంకటేష్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కొత్తపల్లి కుమార్, నాయకులు మల్లయ్య, సుధాకర్, కళ్యాణ్, రాంచందర్, కృష్ణయ్య, పారిజాత, మబ్బు రాము, శివకృష్ణ, శ్రీహరి, రఘువంశీ, శ్రీరాములు, రమేష్, బాలరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయబావుట

- జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు చేరిక

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి, మార్చి 19 : త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులే విజయ బావుట ఎగురవేస్తారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునిసిపాలిటీ పరిధిలోని 12, 14, 18వార్డుల కౌన్సిలర్లు హైమావతి ఎల్లగౌడ్, చిట్టెమ్మ రవి, అలివేలమ్మ కర్నె వాసులు, పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్, చెన్నపురావుపల్లి, కల్వకోల్ ఎంపీటీసీ సభ్యులు కొత్త ప్రతాప్‌రెడ్డి, రాంచంద్రయ్య, వెంకటస్వామి, పెంట్లవెల్లి ఎంపీటీసీ సభ్యురాలు సుమలత శేష బీఆర్ఎస్ పార్టీని వీడి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికీ కాంగ్రెస్ కండువాలు వేసి జూపల్లి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వందరోజుల పరిపాలనలోనే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, నాయకులు వెంకటేశ్వర్‌రావు, వినత్యం, దేవరపాగ రవికుమార్, వి.శ్రీనివాసులు, మేకల చంద్రయ్య, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

మంత్రి జూపల్లికి వినతి పత్రం అందజేత

కొల్లాపూర్, మార్చి 19 : ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కలిసి జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల వినతి పట్ల మంత్రి జూపల్లి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సంఘం అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, జర్నలిస్టులు సురేష్, వినోద్, పుల్లయ్య, శేఖర్, చాంద్‌పాష, రాజేష్‌గౌడ్, ప్రదీప్, ఎజాజ్, వెంకటేశ్, రాయుడు, కర్నె వెంకటస్వామి, ఏదుల వెంకటేశ్, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస ప్యాకేజీ అమలుకు అడుగులు

మన్ననూర్, మార్చి19: అమ్రాబాద్ మండలం సార్లపల్లి గ్రామస్థులకు పునరావాస ప్యాకేజీ అమలు చేసేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అమ్రాబాద్ పులలుల అభయారణ్య డీఎఫ్ఓ రోహిత్ గోపిడి తో కలిసి పునరావాస ప్యాకేజీ కమిటీ సభ్యులు పురావాసం కల్పించనున్న పెద్దకొత్తపల్లి బాచారం లో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు నిర్మించనున్న కాలనీల రహదారులు, ఇళ్ల నమూనా తెలిపే ముగ్గులను వేసి కమిటీ సభ్యులకు అటవీ అధికారులకు చూయించారు. 101 ఇళ్ల నిర్మాణాలు చేపట్టనుండగా, ఇట్టి నివాసాలకు విద్యుత్తు సరఫరా చేసేందుకు ఒక మినీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు విద్యుత్తు అధికారులతో చర్చించారు. కొత్తగా ఏర్పాటు చేసే ఇట్టి గ్రామపంచాయతీకి వ్యాపారాలు చేసుకునేందుకు 40 షెటర్లతో దుకాణ సముదాయాన్ని నిర్మించనున్నట్లు డీఎఫ్ఓ రోహిత్ కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి వీరేష్, సెక్షన్ అధికారి వెంకటయ్య, పునరావాస కమిటీ అధ్యక్షుడు పుణ్యమూర్తి విష్ణు, సభ్యులు రమేష్, నారాయణ, సంతోష్, వెంకటేశ్, అటవీ బీట్ అధికారులు పాల్గొన్నారు.

మాచారంలో ముగిసిన నేత్ర వైద్య శిబిరం

మన్ననూర్, మార్చి19: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర్ సంచార నేత్రాలయ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 10 రోజుల పాటు నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం నేటితో విజయవంతంగా ముగిసింది. నల్లమల పరిసరాల్లోని గ్రామాలకు చెందిన 1193 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలున్న 182 మంది రోగులకు శంకర్ నేత్రాలయకు చెందిన వివిధ ప్రాంతాల్లోని కంటి ఆసుపత్రులో శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మాచారంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో నిర్వహకులు మాట్లాడారు. కంటి వైద్య శిబిరం ద్వారా చాలా మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయించినందుకు నిర్వహకులకు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ డైరెక్టర్ అరుణ్ కుమార్ , నిర్వహకులు జలంధర్‌రెడ్డి, రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మ ఉత్సవాలకు జోగు తిరుగుతున్న యాదవులు

అచ్చంపేట, మార్చి19 : పెద్దమ్మ ఉత్సవాలకు వారం రోజులుగా యాదవులు జోగు తిరుగుతున్నారు. ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల గ్రామంలో ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒక సారి జరిగే పెద్దమ్మతల్లి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతాయి. నియోజకవర్గం నలుమూలలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. జోగు ద్వారా బియ్యం, బెల్లం, నూనె, పసుపు, కుంకుమా తదితర పూజా సామగ్రిని ప్రతీ ఇంటి నుంచి సేకరించి పెద్దమ్మతల్లికి సమర్పిస్తారు. ఈ ఏడాది ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభము ఏర్పాటు చేయనున్నారు. 90 కుటుంబాలకుపైగా ఉన్న యాదవులే కాకుండా ఇతరులు కూడా అమ్మవారి ఉత్సవాలలో పాల్గొంటారు. జోగు కార్యక్రమంలో అల్లి లక్ష్మయ్య, సాయులు, వెంకటయ్య, శ్రీను, లింగమయ్య తిరుపతయ్య తదితరులున్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్
- నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం తనిఖీ



నాగర్‌కర్నూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తూ పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని మౌలిక సదుపాయాల కల్పన, ప్రహరీ భద్రత అంశాలను పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలు పరిశీలించడంతో పాటు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా విధులకు కేటాయించిన ప్రతీ ఒక్కరిని తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని, సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. లోటుపాట్లు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మంగళవారం రెండవ రోజు ద్వితీయ భాష హిందీ పరీక్షకు 10,524 మంది విద్యార్థులకుగాను 10,505మంది విద్యార్థులు హాజరుకాగా 19మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో గోవిందరాజులు తెలిపారు. బిజినేపల్లి బాలికల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా పరీక్షల అబ్జర్వర్ రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనరసమ్మ, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డిబార్ చేయగా పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఇన్విజిలేటర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

నోడల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

నాగర్‌కర్నూల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నోడల్ అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని నోడల్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని నోడల్ అధికారులు ప్రతి ఒక్కరు తమకు విధులను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 22మంది నోడల్ అధికారులను నియమించామని, ఎన్నికల్లో నోడల్ అధికారులకు ఎంతో బాధ్యత ఉంటుందని దీనిని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని గత ఎన్నికల్లో అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఈ లోకసభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఆఫీసర్లకు ట్రైనింగ్ ఏర్పాటు చేయాలని ఈవీఎం కమీషనింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ హోమ్ ఓటింగ్, ఈవీఎం మేనేజ్‌మెంట్ రాండమైజేషన్ పోలింగ్ పర్సన్స్ డేటా ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

నామినేషన్, డేటా ఎంట్రీ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి డైలీ వారి రిపోర్టులు, ఓటరు హెల్ప్‌లైన్ గురించి సుదీర్ఘంగా వివరించారు. ఈ లోకసభ ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని, ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. సీ-విజువల్‌వచ్చిన ఫిర్యాదులపై ఎలా స్పందించాలో వివరాలు తెలియజేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న స్వామి కల్యాణం

బిజినేపల్లి, మార్చి 19 : అలువేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం భక్తుల గోవిందా నామస్మరణలతో వైభవంగా నిర్వహించారు. మండలంలోని పాలెంలోని వెంకన్న స్వామి ఆలయంలో మంగళవారం ఉన్న వాస నక్షత్రం దశమి పురస్కరించుకొని తాడూరు గ్రామానికి చెందిన జటమోని శంకర్, కృష్ణవేణి దంపతులు స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవ కైంకర్య సేవలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో ఎదుర్కొలు, విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, రక్షాబంధనం, యజ్ఞోపవితధారణ, మధుపర్కం, కన్యాదానం, మాంగళ్యధారణం, మాల మార్పిడి తలంబ్రాలు, వారనం మాయురం, ఆశీర్వాదం, తీర్థప్రసాదాల గోష్టిని మంగళవాయిద్యాల మధ్య కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద పండితుల ఆశీర్వచనం, శ్రీవారి కల్యాణ తలంబ్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు, ఈవో రంగారావు, అర్చకులు జయంత్, శుక్లా, సిబ్బంది శివకుమార్, బాబయ్య తదితరులున్నారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న భక్తులు

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- మండలంలో 14 కేంద్రాలు ఏర్పాటు - అచ్చంపేట ఆర్డీవో కె. మాధవి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అచ్చంపేట ఆర్డీవో కె. మాధవి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ కేసీ ప్రమీలతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలో చారకొండ మండలంలోని 11 గ్రామపంచాయతీలకు 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. 18 ఏళ్ల నిండిన యువతి యువతులు తమ ఓటు హక్కును బీఎల్‌వోల వద్ద నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని శిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని దర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నబి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి, మార్చి 19 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యురాలు దివంగత మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా నాయకుడు ఏపీ మల్లయ్య కోరారు. కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడిన యోధురాలు మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో భూమి లేని పేదలందరికీ ఆనాడే పది లక్షల ఎకరాల భూమి పంచారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.పరుశరాములు, నాయకులు జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మీసాల వెంకటయ్య, యూటీఎఫ్ నాయకులు నరసింహ, కృష్ణయ్య, సీపీఎం నాయకులు తిరుపతి, కొండల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లుస్వరాజ్యం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేడు ఎన్ఐఆర్‌డీపీఆర్ బృందం పర్యటన

అమ్రాబాద్, మార్చి 19: అమ్రాబాద్ మండల పరిధిలోని సార్లపల్లి, కుడిచింతల బైలు గ్రామాలలో బుధవారం చెంచుల స్థితిగతుల అధ్యయనం కోసం హైదరాబాద్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలమెంట్ పంచాయతీరాజ్ విభాగం అధికారులు పర్యటించనున్నారని అమ్రాబాద్ ఎంపీడీవో బి మోహన్లాల్ మంగళవారం తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ బృందం రెండు గ్రామాల్లో నివసిస్తున్న ఆదిమ జాతి చెంచుల యొక్క ఆర్థిక పరిస్థితి, వారు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు, మార్కెటింగ్ విధానం తదితర అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం సార్లపల్లిలో గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు

ఊర్కొండ, మార్చి19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ముచ్చర్లపల్లి గ్రామం వద్ద మంగళవారం చెక్ పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వీరబాబు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నియమావళిని అనుసరించి జిల్లా సరిహద్దుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రజలు నడుచుకోవాలని తెలిపారు. అనంతరం వాహనాల తనిఖీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది వెంకోజి, మల్లేష్ తదితరులున్నారు.

ఆల్‌ఇండియా సర్వీసెస్ స్పోర్ట్స్ మీట్‌కు

వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక



చంద్రకళ



సుభాషిణి



లక్ష్మి

మన్ననూర్, మార్చి19: చండీఘర్‌లో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ మీట్‌కు నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన పీఈటీ చంద్రకళ షాట్‌పుట్ , కొల్లాపూర్ జడ్పీహెచ్‌యస్ పీఈటీ లక్ష్మి లాంగ్‌జంప్, శ్రీపురం జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన పీఈటీ సుభాషిణి 400 మీటర్ల పరుగుపందెం, పదరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ మహేష్ నేషనల్ లేవల్ 1500 మీటర్ల పరుగుపందెం పోటీలకు ఎంపికయ్యారు.

రేపు తైబజార్ వేలం

పెద్దకొత్తపల్లి, మార్చి 19 : పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఈ నెల 21న తైబజార్, పశువుల సంతకు వేలం నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి లక్ష్మణ్, గ్రామ కార్యదర్శి నాగశేషి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ ఆవరణ లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు తైబజార్ కు రూ. 30వేలు, పశువులు, మేకలు, గొర్రెల సంతకు రూ. 20వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని వారు కోరారు.

వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

- బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 19 : నాటు మందు పోస్తూ ప్రజలతో ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్, జిల్లా అదనపు ఎస్పీలకు బీఎస్పీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సంత బజార్‌లో ఓ ఆర్ఎంపీ డాక్టర్ తెలిసి తెలియని వైద్యం చేసి అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని ఆరోపించారు. అలాంటి వైద్యునిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కల్యాణ్, ఈసీ మెంబరు రాము, బిజినేపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాంచందర్, శివకృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్, మార్చి 19 : తెలంగాణ గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు కొల్లాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 21 ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల మధ్య విద్యార్థులకు బీఎల్‌వీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్. ఈఐఎస్.ఏసీ.ఇన్ లేదా టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ వెబ్‌సైట్ టీజీటీడబ్ల్యూజీయూఆర్ యూకేయూఎల్‌ఏఎం. తెలంగాణ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె విద్యార్థులకు సూచించారు.

చీడపీడల నివారణపై అవగాహన

అచ్చంపేట రూరల్, మార్చి 19 : వరిలో కాండం తొలుచు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వాటిని ఆదిలోనే నివారించి పంటను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొండ కృష్ణయ్య సూచించారు. మంగళవారం అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లిలో రైతుల అవగాహన కల్పించారు. అలాగే వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు.

బీఆర్ఎస్‌లో చేరిన కొమ్ము శ్రీనివాస్‌యాదవ్

కల్వకుర్తి, మార్చి 19 : కల్వకుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బరిలో నిలిచి ఘన విజయం సాధించబోతున్నారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తాము పని చేస్తామన్నారు.

నేడు మండల సభ

కల్వకుర్తి, మార్చి 19 : కల్వకుర్తి మండల సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మనోహర అధ్యక్షతన నిర్వహించనున్న మండల సభకు గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'జెండాలు మోసిన వారికే గుర్తింపు'

చారకొండ, మార్చి 19: మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన వారికే గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఉండి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలోకి పలువురు వస్తున్నారన్నారు. పార్టీలో మొదటి నుంచి ఉన్న కార్యకర్తలకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, జేసీబీ వెంకటయ్యగౌడ్, శంకర్‌గౌడ్, కందికంటి శ్రీనివాసులుగౌడ్, గజ్జె కొండలయ్యగౌడ్, జూలూరి లక్ష్మయ్యగౌడ్, నర్సింహచారి, భరత్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

-ఇద్దరిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, మార్చి 19 : మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన సారా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ బి.నాగిరెడ్డి తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల, మారేడుమానుదిన్నె తండాల్లో దాడులు నిర్వహించి 600లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తెలకపల్లి, మార్చి 19 : మండల పరిధిలోని గట్టునెల్లికుదురుకు చెందిన పిట్ల ప్రశాంత్ (18) అనే యువకుడు ఆదివారం పొలంబాట విషయంలో గొడవ జరగడంతో ప్రత్యర్థులు బెదిరించారు. దాంతో భయపడి మిద్దెపై పడుకుంటున్నాని చెప్పి వెళ్లి పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో ప్రశాంత్ మృతదేహన్ని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. పదివేల ఆర్థిక సహాయం అందజేశారు.

అక్రమ వెంచర్ రాళ్ల తొలగింపు

కల్వకుర్తి, మార్చి 19 : కల్వకుర్తి పట్టణంలో సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ వెను భాగంలో సర్వే నెంబరు 746/ఈ/1లో ఏలాంటి అనుమతులు లేకుండా నాలుగెకరాలల్లో అక్రమంగా వేసిన వెంచర్ రాళ్లను తొలగించినట్లు మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. మంగళశారం కమిషనర్ సిబ్బందితో కలిసి డోజర్‌తో రాళ్లను తొలగించారు. పట్టణంలో ఉన్న ఇతర లేఅవుట్లను పరిశీలించి అనుమతి లేని వాటిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అక్రమ వెంచర్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇదివరకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ వెంట టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అసిస్టెంట్ శ్రీధర్, శ్రీకాంత్, యాదగిరి, రాము, సాగర్ ఉన్నారు.

గర్భిణులకు సీమంతం

పెద్దకొత్తపల్లి, మార్చి 19 : మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ గ్రామంలోని 1, 2 ,3 అంగన్‌వాడీ కేంద్రాలల్లో మంగళవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అలాగే చిన్నారులకు పౌష్టికాహారం అందజేసి అక్షరాభ్యాస చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సులోచన, వరలక్ష్మీ, స్రవంతి, ఆయా అనంతమ్మ పాల్గొన్నారు.

సాగును లాభసాటిగా చేయడమే లక్ష్యం

వంగూరు, మార్చి 19: సాగులో విప్లవాత్మక దృశ్యశ్రవణ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని ఏవో తనూజ అన్నారు. మంగళవారం మండలంలోని కొండారెడ్డిపల్లి రైతు వేదిక భవనంలో రైతునేస్తం పేరిట నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులతో క్షేత్రస్థాయి సమస్యలపై ముఖాముఖిగా చర్చించారు. ఈ సందర్భంగా ఏవో తనూజ రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం, శుక్రవారం రైతులకు నేరుగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు, పాల్గొన్నారు.

'భగత్‌సింగ్ వర్ధంతి సభలను జయప్రదం చేయండి'

కల్వకుర్తి, మార్చి 19 : భగత్‌సింగ్ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు సంతోష్ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి వాల్‌పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 30వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు బాలకృష్ణ, సాయి, వంశీ, భరత్, రాజేష్ ఉన్నారు.